# హృదయము ప్రేమమయంగా మార్చుకున్నప్పుడు జగత్తు బ్రహ్మమయంగా మారుతుంది

పనిపాటలందె మీ బ్రతుకంత తెల్లారె
ఇదియె జీవితమని ఎంచినార
మూడు పూటలు మీరు భుజియించి తృప్తిగా
ఇదియె జీవితమని ఎంచినార
అలసటదీరగా హాయిగా నిదురించి
ఇదియె జీవితమని ఎంచినార
కాదు జీవిత రహస్యమెరుగు కొరకు
ఇందుకే దేవుడు నిచ్చె జన్మ
తెలివితేటలు కల్గియు తెలిసికొనక
కాలమంతయు నూరక గడుపనేల?
మనిషిగా మీరలికనైన మసలరయ్య
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

సర్వ సౌఖ్యంబులు సమకూర్చు ధనమన్న
ఎంతవరకది నీ చెంతనుండు?
ఆనందమది ఎంతొ అందించు ధనమన్న
ఎంతవరకది నీ సొంతమగును?
కష్టముల్ పోగొట్టి శాంతి నిచ్చునదన్న
ఎన్ని కష్టములను ధనము యిచ్చె?

sri sathyasai vachanamrutam

**శాశ్వతంబైనట్టి సౌఖ్యంబు కోరక**
**ధనముకై జన్మను ధారపోసి**
**ఏమి సాధించితివి నీవు జగతియందు?**
**ఎంత వరకుండెదవు నీవు జగమునందు?**
**నేనెవరు నాదు కర్తవ్యమేమిటో**
**ప్రశ్న వేసుకో నరుడ! సత్యంబు గోచరించు.**

ప్రేమస్వరూపులారా!

జగన్నాటకరంగమునందు మానవుడు వేయని వేషములేదు. చేయని నటనలేదు. 84 లక్షల వేషములు వేసి ఆ వేషములకు తగినట్లు నాటకములాడి విసుగు చెందక ఈ వేషమును విప్పక, తన నాటకమును చాలించక, జీవితమును యింకా సాగించుకుంటూ వస్తున్నాడు మానవుడు. ఒక్క అధికారి 8 గం॥లకు ఆఫీసుకువెళ్లి ఎప్పుడు నాలుగు గంటలు లేదా నాలుగున్నర గంటలవుతుందా తన స్వస్థానమైన గృహమునకు చేరుదునాయని తన స్వస్థానము చేరుటకై చాలా ఆత్రుత పడుతుంటాడు. ఏ ట్రైనులోనో, ఏ బస్సులోనో కూర్చుని ఎంతత్వరగా తన స్వస్థానమునకు చేరవలెనని ప్రయాణము సాగిస్తాడు, ఆత్రుతతో ఎప్పుడెప్పుడు స్వస్థానమనే గృహము చేరుతామా అని తొందరపడుతుంటాడు, మానవుడు. కానీ జీవితవిషయమందు మానవుడు ఎన్ని జన్మలెత్తినప్పటికిని ఎంతభారము మోస్తున్నప్పటికిని, నష్టములు కల్లోలములలో చిక్కుకున్నప్పటికిని యింకనూ ఈ వేషము వీడకుండా ఉండటము గొప్ప విచిత్రముగా ఉంటున్నాది. మానవునకు జీవితమంటే చాలా ప్రీతి.

**మానవుడు నశించినప్పటికి మానవత్వము నశించేది కాదు**

మానవుడనగా ఎవరు? లాటిన్ భాషలో విర్ అనే ధాతువునుండి పుట్టినదే పవిత్రము. 'మానవజీవితము చాలా పవిత్రమైనది', అని దీనియొక్క అంతరార్థము. మానవుడు నశించినప్పటికిని మానవత్వము నశించేది కాదు. ఈ మానవత్వమునకు నశింపు అనేదే లేదు. నిరంతరము అమృతస్వరూపము నిండి ఉంటుంది. ఆనందమయమై ఉంటుంది.

sri sathyasai vachanamrutam

అత్యంత మధురమై ఉంటుంది. కనుక, మానవుడు ఎన్ని కష్టములు, ఎన్ని దుఃఖములు, నష్టములు సంభవించినా యింకను జీవించాలి, జీవించాలని అమృతమయమైన జీవితముకోసమని అఱ్ఱులు చాస్తూ ఉంటాడు. ఇన్ని రకములైన బాధలను అనుభవిస్తున్నప్పటికి, మరొక వైపున 'శాంతి, సంతోషము ఈ రెండు నాకత్యవసరము' అని భ్రమిస్తుంటాడు. వీటికొరకు ఎక్కడ వెతుకుతున్నాడు? ఎక్కడుందీ ఆనందము? ఎక్కడుందీ సుఖము? మానవునికి సుఖమెక్కడున్నదో తెలియదు. భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన ప్రవర్తనయందు మాత్రమే సుఖమున్నదని భ్రమిస్తున్నాడు. సుఖము ప్రాకృతమైన జగత్తులో మనకు కానరాదు. శాంతి అంతకంటె మనకు కనిపించదు. శాంతి భగవత్స్వరూపమే! ఆనందముకూడా భగవత్స్వరూపమే! ఈ భగవత్స్వరూపము ఎక్కడున్నది? ఎక్కడో బయట ప్రపంచమందులేదు. తనయందే ఉంటున్నది. తనయందే ఉండిన ఆనందమును తనయందే ఉండిన శాంతిని తాను విస్మరించి బయట ప్రపంచమందున్నదని విశ్వసించి కాలమును వ్యర్థము చేసుకుంటున్నాడు, మానవుడు.

**సర్వము మానవుని హృదయమునుండే ఆవిర్భవిస్తున్నాయి**

**సకల విద్యలు నేర్చి సభ జయించగవచ్చు**
**శూరుడై రణమున పోరవచ్చు**
**రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు**
**హేమభూదానముల్ యీయవచ్చు**
**గగనంపు చుక్కలు గణియింపగావచ్చు**
**జీవరాసుల పేర్లు చెప్పవచ్చు**
**అష్టాంగవిద్యలన్ని నేర్వగవచ్చు**
**చంద్రమండలయాత్ర సలుపవచ్చు**
**కాని దేహేంద్రియాదుల నరికట్టి**
**మనసు నిల్పియు నంతర్ముఖము చేసి**
**అనవరత నిశ్చలంబైన ఆత్ములగుచు**

srisathyasaivachanamrutam

నిలువగాలేరు మానవుల్ నియతితోడ.

ఈనాటి మానవుడు శాంతిని, ఆనందమును పొందుటకు తగిన అవకాశములేదని విచారించటములో అంతరార్థము మనం గుర్తించాలి. మానవునకు దేహభ్రాంతి అధికమవుతూ వస్తున్నాది. 'దేహము నాది' అనుకోటంలో తప్పులేదు. కాని 'దేహమే నేను' అనుకోటము పెద్ద తప్పు. అదే మీ అశాంతికి, అంసతృప్తికి మూలకారణము. దేహమనోబుద్ధులను క్రమక్రమేణా ఎంతవరకు తగ్గించుకుంటూ వస్తామో అంతకాలములోపలనే మనము శాంతిని, ఆనందమును అనుభవించగలుగుతాము. దేహము నేను కాదని ప్రతి మానవునకు తెలుసు. తెలిసికూడను, దేహాభిమానము దినదినమునకు పెరుగుతున్నదేగానీ తరుగుటలేదు. అయితే నిద్రావస్థయందు ఈ దేహాభిమానము ఎక్కడుంది? ఎక్కడున్నదో తనకే తెలియదు. కానీ, తాను ఉన్నాడు. గాఢనిద్రయందుకూడా మానవుడున్నాడు. కానీ ఎక్కడున్నాడనే విషయముకూడా దీనికి సంబంధించినది. నిద్రలో తాను ఎక్కడున్నాడో, మరణించిన తరువాతకూడా అక్కడే ఉంటున్నాడు. కనుక, సర్వము మానవుని హృదయమునుండే ఆవిర్భవిస్తూ వచ్చినాయి. ఈ సత్యము మానవుడు గుర్తించుకొనలేక హృదయము అత్యంత దూరముగా ఉండినట్లు భావిస్తున్నాడు.

**ఈనాటి మానవుడు హృదయమును మూసికొని నోరు తెరచుకొని జీవిస్తున్నాడు**

ఈనాడు మనము శాంతిని అనుభవించవలెనన్న మాటలు తగ్గించి నోరు మూయించి హృదయాన్ని తెరిపించాలి. ఈ అంతరార్థమును గుర్తించియే ప్రాచీన ఋషులు అరణ్యమునకు వెళ్లి మౌనము వహిస్తూ వచ్చారు. కానీ, ఈనాటి మానవుడు హృదయమును మూసుకొని నోరు తెరచుకొని జీవిస్తున్నాడు. మనము నోరుమూయాలి, హృదయమును తెరవాలి. అక్కడనే భగవంతుడు నివసిస్తున్నాడు. అనేకమంది పండితులు, శాస్త్రజ్ఞులు వేదవేదాంగములు అధ్యయనం చేసిన మహాపండితులుకూడను ఈ సత్యమును గుర్తించుకొనలేక తాము గొప్ప పండితులమని విఱ్ఱవీగుతున్నారు. మానవుడు సకల శాస్త్ర, పురాణ ఇతిహాసములను చదువుతున్నాడు. అయితే ఇది గ్రంథపరిచయమేగానీ ఆచరణలో కనిపించటం లేదు. ఈనాటి

sri sathyasai vahanamrutam

మానవుడు వేసే ప్రతి అడుగు ధర్మమును తప్పుతున్నది. ఈనాటి మానవుడు పలికే ప్రతి పలుకునందు సత్యము సడలిపోతున్నాది. ఈనాటి మానవుడు చూచే ప్రతి చూపునందు ప్రేమ మరుగున పడిపోవుచున్నాది. ఈనాటి మానవుడు ఆలోచించే ప్రతి ఆలోచనయందు దూరదృష్టి నశించిపోతున్నాది. ఈనాటి మానవుడు కోరే ప్రతి కోరికయందు స్వార్థము, స్వప్రయోజనమే ప్రత్యక్షమవుతున్నది. మానవునియందున్న దుర్గుణములు, దురాలోచనలు, దుస్సంగములు అనేక విధములుగా స్వేచ్ఛా విహారములు సలుపుతున్నాయి. ఇలాంటి పరిస్థితులందు హృదయమును ఏ రీతిగా తెరుచుకోగలము? నిజముగా మనకు అడ్డు వచ్చేది ఏమిటి? మనము చేసే సాధనలంతా దేనిద్వారా చేస్తున్నాము? మనసుద్వారానే! దేనిని మనం పొందాలని ఆశిస్తున్నామో దానికి మనస్సే అడ్డు తగులుతున్నాది. సమస్తమునకు మనస్సే అడ్డు తగులుతున్నాది. మనసును ఏనాడు మనము మరుగు చేసుకుందుమో ఆనాడే సర్వము మనకు ప్రత్యక్షమవుతుంది. కనుక, మానవుడు ఈనాడు మనసును మరచాలి. ఈ మనసును మరచే నిమిత్తమై చేసేవే ఈ సాధనలు. సాధనలు అనగా జపమో, యోగమో, యమనియమములో ఇవికాదు.

**మనసును మరచిపోగల సాధనయే నిజమైన సాధన**

ఏ సాధనలచేత మనసును మరచిపోతామో అదే నిజమైన సాధన. మన దృష్టిని హృదయమువైపు మరల్చాలి. అప్పుడే మనస్సుయొక్క మరుపు కలుగుతుంది. మనస్సుండినంతవరకు మనిషి ఉండక తప్పదు. మనసు దేహాభిమానముచేత, దేహముయొక్క సంబంధముచేత జీవించినంతవరకు మనకు సుఖము లభ్యము కాదు. మానవుడు దేహముతో తాదాత్మ్యభావము పొందినాడు. కనుక, సత్యనిత్యమైన స్వరూపమును మనం గుర్తించుకోలేకపోతున్నాము. దేహము ఎంత అస్థిరమో! ఈ భ్రమలుకూడా అంత అస్థిరమే. ఒక చిన్న ఉదాహరణము. 'దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, అంతఃకరణ యివన్నీ దేని నిమిత్తమై అందించాడు భగవంతుడు' అని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇంటిలో మంచి పరుపు వేసుకున్నాము. మంచి అనుకూలమైన దిండు పెట్టుకున్నాము. ఫ్యాను తిరుగుతున్నాది. ఎయిర్‌కండిషన్ చక్కగా

srisathyasaivachanamrutam

పని చేస్తున్నాది. కానీ నిద్ర రావటంలేదు. ఇవన్నీ దేనికోసం మనం పెట్టుకున్నాము? నిద్రకోసమని అన్ని అనుకూలాలు చేసుకున్నాము. నిద్ర రానప్పుడు యివన్నీ ఉండి ప్రయోజనం ఏమిటి? అదే విధముగా నీ స్వస్వరూపము గుర్తించే నిమిత్తమై మనసు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ ఈ అన్ని అనుకూలాలు అందించాడు, భగవంతుడు. ఇంతేకాదు, మనస్సుకు విశ్రాంతినిచ్చే నిమిత్తము కొన్ని సాధనలు యిచ్చాడు. అదే నవవిధ మార్గములు.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఇవన్నీ దేనికోసం? నీ తత్త్వాన్ని నీవు గుర్తించేకోసం. లేకపోతే పరుపు ఎందుకు, ఈ దిండు ఎందుకు, ఎయిర్‌కండిషన్ ఎందుకు? ఇవన్నీ ఉండి నిద్రయే లేకపోతే అవి వ్యర్థమే! మనసుండి, బుద్ధి ఉండి, చిత్తముండి, అంతఃకరణ ఉండి, జ్ఞానము ఉండి, నిన్ను నీవు తెలుసుకోలేకపోతే అన్నీ వ్యర్థమే!

**జగత్తునందు సర్వము భగవత్సృష్టియే**

కనుక, ఆధ్యాత్మిక మార్గమునందు చక్కని అంతరార్థము గుర్తించుకున్నప్పుడే మానవత్వము అంటే ఏమిటో అర్థమవుతుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ఇందులో ఏమి విశేషముంటున్నాది? ఏమి సుకృతము ఉంటున్నాది. ఏమిటీ దుర్లభం? 'ఆహారనిద్రాభయమైథునాని', ఇవన్నీ పశుపక్షిమృగాదులకు కూడా ఉంటున్నాయి. అదే మనముకూడా అనుభవిస్తున్నాము. యింక పశుపక్షిమృగాదులకు, మనిషికి ఉండిన వ్యత్యాసము ఏమిటి? మానవులలో ఏదో గొప్ప విశేషము ఉంటుండాలి కదా? ఏదో ఒక విశిష్టత ఉండాలి కదా? ఆ విశిష్టత ఏ మానవుడు చూడగలుగుతున్నాడు? ఏమీ లేదు. ఇంకా పశుపక్షిమృగాదుల జీవితమే మేలనిపిస్తుంది. వాటికి season, reason ఉంటున్నాయి. మానవునికి no season, no reason. పశుపక్షిమృగాదులు అప్పటికప్పుడు తిని ఆకలి తీర్చుకొని హాయిగా జీవిస్తున్నాయి. కానీ మానవుడు అప్పటికప్పుడు తినటమే కాకుండా 10 సం॥ల ప్లానుకు తగిన ఆహారము పోగుచేసుకొనినా తనకు శాంతిలేదు. భగవంతుని ఎక్కడో మనం వెతకనక్కలేదు. అనిల్‌కుమార్ 'స్ఫటిక లింగములో స్వామిని చూచాను' అన్నాడు.

sri sathyasai vachanamrutam

'ఎదుటనున్న స్వామిని ఎరుగంగ లేక స్ఫటికలింగమందు'. ఇది పెద్ద అజ్ఞానము. యిదే భ్రమ. ప్రతి ఒక్కటి reflection of the inner being. తనయందున్న reaction, reflection, resound ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ జగత్తునందు చెడ్డది అనేది ఎక్కడా లేదు. అంతా మంచిదే! ఎందుకోసం? సర్వము భగవత్సృష్టియే! భగవంతుడు చెడ్డ ఎందుకు సృష్టిస్తాడు? దృష్టిలో దోషమున్నదే గానీ సృష్టిలో దోషము లేదు. భగవంతుని సృష్టి అంతయు పవిత్రమైనదే, నిత్యమైనదే, సత్యమైనదే, నిర్మలమైనదే, నిస్స్వార్థమైనదే! అందుకోసమే 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం' అన్నారు.

**అంతర్దృష్టి కలిగినవాడే ఋషి**

మంచిచెడ్డలు నిర్ణయించేది మనస్సే! అన్నింటికి కంట్రోలర్ మన హృదయములో ఉంటున్నాడు. దానిని మనం గుర్తించుకోలేకుండా ఉన్నాము. ఈ మనస్సు ఒక నిముషం నెగిటివ్ చూపుతుంది, మరొక నిముషం పోజిటివ్ చూపుతుంది. ఒక నిముషం మంచి చూపుతుంది, ఒక నిముషం చెడ్డ చూపుతుంది. మంచిచెడ్డలు మనస్సు చూపేవేగానీ మనిషిలో ఉండేవికాదు. మనిషి పవిత్రుడే, నిర్మలమైనవాడే, నిశ్చలమైనవాడే! కానీ, ఈ మనస్సు ప్రవేశించి అనేక రకములైన మంచిచెడ్డలను కలిగిస్తుంది. సాధ్యమైనంతవరకు మనసును అదుపులో పెట్టుకోవటానికి కృషి చేయాలి. మనస్సును అదుపులో పెట్టుకున్నవారు ఋషులు అన్నారు. ఈనాడు మనస్సును విచ్చలవిడిగా విడిచిపెట్టి అనేక రకములైన ఫలితములు అనుభవిస్తున్నారు. బయటి దృశ్యము చూచేవాడు పశువుతో సమానము. అతను దివ్యతత్త్వం చూడక ఉండటం చాలా విచిత్రము. ఈనాడు వైజ్ఞానిక శాస్త్రజ్ఞులందరు బయట దృష్టి కలిగినవారే! బయట దృష్టి కల్గినవాడు సైంటిస్టు. అంతర్దృష్టి కలిగినవాడే ఋషి. ఈ ఋషికి, సైంటిస్టుకు ఎంత వ్యత్యాసము చూడండి! మంత్రములోపల ఉన్నది, యంత్రము బయట ఉన్నది. యంత్రములో మనకు శాంతిలేదు. మంత్రములో నున్నది శాంతి. ఈనాటి మానవుడు ఈ జగత్తులో విశ్రాంతి భవనములు ఎన్నో నిర్మిస్తున్నాడు. కానీ, శాంతి భవనములు ఎక్కడా కనిపించటంలేదు. ఈ శాంతిలేని

srisathyasaivachanamrutam

విశ్రాంతి ఏమి ప్రయోజనము? శాంతి భవనము మనలోనే ఉంటున్నాది. కానీ మనము అడిగినంతమాత్రమున లభ్యమయ్యేదికాదు.

**అడుగకుండా పనిచేసేవాడు స్వంత మనిషి**

**అడుగకువె ఓ మనసా**
**అడుగు కొలది అది అడుగున పడునని**
**అడుగకున్న పని వడిగానగునని ॥అడు॥**
**అడుగని శబరిని ఆదరించదే**
**అడుగక తనకై మడియు జటాయువు**
**కడకునేగి సద్గతి కల్గించదే ॥అడు॥**

అనేకమంది భక్తులు సాధనలు చేస్తున్నారు. కానీ ఈ సాధనల ఫలితము ఏమిటి? 'ఓ భగవంతుడా! నాకు అది చేయి, ఇది చేయి', అని ప్రార్థిస్తున్నారు. పండితులుకూడా చెప్పారు, పొద్దున్న. అంతా 'చమే చమే' యియ్యి అని అర్థము. అంతా కోరికలే! 'అడిగేవాడు ఎవడు, అడగని వారు ఎవ్వరు?' అని విచారణ చేస్తే అడిగేవాడు కూలివాడు. అడగనివాడు స్వంతమువాడు. యింటిలో ఇల్లాలు వంట వండి అనేక పనులు చేస్తుంది. కానీ 'ఏమండీ! నేను ఇంత పని చేశాను నాకు కూలి యిస్తారా?' అని అడుగుతుందా? ఆమె ఇంటి యజమానురాలు. అదే పాత్రలు తోమే పనిమనిషి ఉంటుంది; నెల వచ్చేటప్పటికి 'అమ్మా! జీతం యివ్వండి', అని అడుగుతుంది. అడిగేవాడు పనివాడు. అడగకుండా పని చేసేవాడు స్వంతమువాడు. నీవు స్వంతమువాడు కావాలి గానీ పనివాడు కాకూడదు. స్వంతమువానికే యింటిలో విలువైనవి తెలుస్తాయి. విలువైన పెట్టిలో పెట్టిన నగలు యజమానికి తెలుస్తాయిగానీ బయట మనిషికి తెలియదు. పనిమనిషికి బయట పారవేసేవి, పాతవి కనిపిస్తుంటాయి. కనుక హృదయములో నుండిన విలువైనవి యజమానికిమాత్రమే అర్థమవుతాయి. అదే శాంతి. విలువైనది. ప్రేమ విలువైనది, ధర్మము విలువైనది, సత్యము విలువైనది, అహింస విలువైనది. ఈ విలువైనవన్నీ మనం లోపల పెట్టుకున్నాం. అది ఆ యజమానునికే తెలియాలి. ఎవరు దీనికి యజమాని? దైవమే యజమాని. లోపలే ఉన్నాడు

sri sathyasai vachanamrutam

యజమాని. ఆ లోపల ఉండటంచేత దేహమనే రథము కదలిపోతున్నది. డ్రైవరు బయట కూర్చుని కదలమంటే కదులుతుందా కారు. కారులోపల కూర్చున్నంతమాత్రమున తాను కారు అవుతాడా? కాదు కాదు. నడిపేవాడు లోపలనే కూర్చోవాలిగానీ బయటకాదు. హృదయమనే పీఠముపై కూర్చుని దేహమనే రథమును నడుపుతున్నాడు.

## భగవంతుడు మన లోపలనే ఉన్నాడు

భగవంతుడు మనలోపలనే ఉన్నాడు. సర్వత్ర కనిపించవచ్చు. కానీ ఎక్కడనుంచి కనిపిస్తున్నాడు? Reflection of the inner being. తనయందున్నవాడే బయట కనిపిస్తున్నాడు. తనలోపలే లేక బయట ఏవిధముగా కనిపించగలడు? అతనే 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి'. ఉన్నది ఒక్కడే, అనేక రూపనామములలో కనిపిస్తువచ్చాడు ఋషులకు. ఏకాత్మభావమును మనము అభివృద్ధిపరచుకొని 'అందరుకూడా సోదరులే, సోదరీమణులే! అన్ని దేహములు దేవాలయమువంటివే! దేవుడు ఎక్కడో బయటలేడు. దేహమే దేవాలయము', ఈ భావమును మనము పెట్టుకోవాలి. దీనిని గట్టిగా విశ్వసించాలి. ఎవరిని ఏ బాధపెట్టినా తనను బాధించుకున్న రీతిగా చూచుకోవాలి. ఎందుకనగా అన్ని దేహములలోనున్న భగవంతుడొక్కడే! అట్టి భగవంతుని మనం ఏరీతిగా చూడాలి? మనయందు ప్రేమతత్త్వమును అభివృద్ధిపరచుకున్నప్పుడు సర్వము ప్రేమమయంగా కనిపిస్తుంది. కంటికి నీలంరంగు అద్దములు వేసుకుంటే జగత్తంతా నీలముగా కనిపిస్తుంది. కానీ జగత్తంతా నీలిరంగులో ఉందా? లేదే? మనము వేసుకున్న అద్దముల రంగు కనిపిస్తున్నాది. కనుక, హృదయము ప్రేమమయంగా మార్చుకున్నప్పుడు జగత్తు బ్రహ్మమయంగా మారుతుంది. జగత్తంతా బ్రహ్మమయంగా చూడాలంటే మొట్టమొదట హృదయమును ప్రేమమయంగా మార్చుకోవాలి. ఆ ప్రేమలేనివానికే జగత్తు అన్ని రకములుగా రూపనామములు కనిపిస్తాయి. ఈ భిన్నత్వము సత్యము కాదు. ఏకత్వమే సత్యము. అదే శంకరులు బోధించిన అద్వైతము. కనుక ఏకత్వమనే తత్వము చక్కగా ప్రతి మానవుడు అర్థము చేసుకోవాలి.

sri sathyasai vachanamrutam

## మన దృష్టి మార్చుకున్నప్పుడే గమ్యాన్ని చేరతాము

దైవముకోసము ఎక్కడో వెతకనక్కరలేదు. దైవము నీయందే ఉంచుకొని నీవు ఎక్కడో బయట వెతుకుతున్నావు. నీ కంఠములో మాలలు ధరించుకొని ఏ విధంగా నీకు నీవు ఆనందిస్తున్నావో ఆ విధంగా అహంకారము, అభిమానము యిలాంటి నగలంతా మెడలో ధరించుకొని ఆనందిస్తున్నావు. అహంకారమనే అలంకారము తీసివేయి. అభిమానమనే అలంకారము తీసివేయి. భిన్నత్వము అనే అహంకారము తీసివేయి. Less luggage, more comfort, make travel a pleasure. ఈ విధమైన బరువు క్రమక్రమేణా తగ్గించుకుంటూ రావాలి. కానీ, ఈనాటి మానవుని భారము దినదినమునకు పెరిగిపోతున్నాది. శాంతి ఎట్లా మనకు ప్రాప్తిస్తుంది? సంతోషము ఎక్కడ మనకు లభిస్తుంది? లభించదు. క్రమక్రమేణా సంతోషము, శాంతి నాయందే ఉంటున్నవని తెలుసుకోవాలి. రాతియందు తాదాత్మ్యభావము ఎట్లా పెట్టుకుంటున్నావో దేహమునందు తాదాత్మ్యభావము ఆ విధంగా పెంచుకుంటున్నావు. 'ఈ దేహము నాది అని అనుకో, తప్పులేదు. కానీ, దేహమే నేనని స్మరించకూడదు'. ఇది ఏమిటి? బట్ట. దూరం పెట్టాము. 'నా టవలు' అన్నప్పుడు టవలు నా కంటే భిన్నముగా ఉంటున్నాది. 'నా టంబ్లరు' అంటుంటే టంబ్లరు నాకంటె భిన్నముగా ఉంటున్నాది. అదే రీతిగా 'నా దేహమంటే నాకంటే దూరంగా ఉంటున్నాది, దేహము. నేను దేహము కాదు. కారులో కూర్చుని నడుపుతున్నంత మాత్రమున కారు తాను కాదు. అదే విధముగా ఈనాటి మానవుడు ఆధ్యాత్మిక మార్గములో కొన్ని అపప్రథలకు గురవుతున్నాడు. ప్రాచీన కాలమునుండి అనేకమంది పండితులుకూడా ఈ విషయములో పెడ మార్గము పట్టించి అశాంతికి గురౌతూ వచ్చారు. పూజలు చేయవచ్చు, వ్రతములు చేయవచ్చు. కానీ యివన్నీ తాత్కాలిక మనశ్శాంతి నిమిత్తము. ఏనాటికి ఇవి మనలను గమ్యమునకు చేర్చలేవు. మన దృష్టి మార్చుకున్నప్పుడే గమ్యాన్ని చేరతాము. ఆ దృష్టి ఎక్కడ మార్చాలి? అంతర్ముఖంగా మార్చుకోవాలి. అప్పుడే దీనికి తగిన గమ్యము లభ్యమవుతుంది.

## ఎక్కడ పవిత్ర హృదయము ఉంటుందో అక్కడ అంతా ఆస్తికత్వమే!

ప్రేమస్వరూపులారా! భక్తి, ప్రపత్తులు చాలా ఉత్తమమైన మార్గములు. దీనియందుకూడా

sri sathyasaivachanamrutam

ప్రాకృతమైన భావముండినంతవరకు మనము కొన్ని సేవలు చేస్తూరావాలి. అయితే ఈ సేవలు ఏ విధంగా చేయాలి?

**న తపాంసి న తీర్థాని న శాస్త్రాణి జపా నహి**
**సంసారసాగరోద్ధారే సజ్జన సేవనం వినా.**

సజ్జనులకు సేవ చేయాలి. దుర్జనుల సేవకాదు. అయితే 'దుర్జనులు లేరని చెప్పారు కదా, స్వామి' అని మీరనుకోవచ్చు. ప్రాకృతమైన దృష్టి ఉన్నంతవరకు సజ్జనులు, దుష్టులు అని వేరువేరుగా భావించవచ్చు. కానీ పవిత్రమైన హృదయమే మనకు ప్రాప్తించినప్పుడు అందరూ సజ్జనులే! ఆ సజ్జనత్వమనే భావము మనలో ఆవిర్భవించినప్పుడు అంతా సజ్జనంగానే మారుతుంది. చక్కగ మన పవిత్ర చరిత్రలను విచారించుకుంటే ఆనాటి అరణ్యములలో క్రూరమృగములు, ఋషులు ఒకే స్థానములో నివసిస్తూ వచ్చారు. ఈ క్రూరమృగముల భయము ఋషులకు లేదు. ఋషుల భయము క్రూరమృగములకు లేదు. ఎందువల్ల? వీరికి ఆ క్రూరమృగములపై ద్వేషములేదు. దానికికూడా వారిపై ద్వేషములేదు. 'యద్భావం తద్భవతి'. ఇద్దరుకూడా ఒకే స్థానములోపల ఐకమత్యంగా జీవిస్తూ వచ్చారు. ఋషుల దగ్గర బాంబులు, తుపాకులు ఏ అస్త్రములు లేవు. ఋషుల దగ్గర ఉన్న అస్త్రము ఏమిటి? ప్రేమాస్త్రము ఒక్కటే! ఆ ప్రేమాస్త్రముచేత క్రూరమృగములుకూడా ప్రేమమయంగా మారిపోతూ వచ్చాయి. కనుక మనలో ప్రేమమయమైన హృదయము ఉంచుకున్నప్పుడు మనకు దుష్టుడే కనిపించడు. వారుకూడా సజ్జనులుగా మారిపోతారు. లోకములో 'సర్వేజనా సుఖినో భవంతు', అందరు సుఖంగా ఉండాలి. అందరు క్షేమంగా ఉంటుండాలి. అందరు ప్రేమమయంగా ఉంటుండాలి. ఆస్తికులు, నాస్తికులు, ఆస్తికనాస్తికులు అనే భేదములే లేవు. ఆస్తికుడు పూజ చేస్తున్నాడని నాస్తికుడు పూజ చేయలేదని అనుకోటం సరికాదు. ఈ పూజలవల్ల నాస్తిక, ఆస్తికత్వము నిర్ణయించుటకు వీలుకాదు. ఎక్కడ పవిత్ర హృదయము ఉంటున్నదో అక్కడ ఆస్తికత్వమే! Every good work is GOD's work. మనం మంచి పనులు చేయటానికి ప్రయత్నం చేయాలి. పరులను బాధించని పనులు చేయుటకు ప్రయత్నించాలి. ఎవరిని నొప్పించే పలుకులు మనం ఉపయోగించరాదు. ఉదయం శాస్త్రి

sri sathyasai vachanamrutam

చెప్పారు. 'సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై....' ఏమిటి దీని అర్థము? వేదము బోధించింది అనుకుంటున్నారు. వేదము ఏ మాత్రము బోధించలేదు.

**హృదయము పరిపక్వస్థితికి వచ్చినప్పుడు మాధుర్యము దానంతట అదే వస్తుంది**

వేదమంతా ఏకత్వమే బోధిస్తూ వచ్చింది. ఈ 'సహనావవతు' అంటే అంతరార్థము ఏమిటి?

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి కలిమిచెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**
**శాంతిశాంతి శాంతియని శాంతిపూజ చేయుదాం**
**ఓంఓంఓం అనుచు ఓంకారము పాడుదాం.**

ఇదే శాంతి, అని చెప్పింది వేదము. ఎంత పవిత్ర ఆదర్శమునందించింది వేదము! ఎంత దివ్యమైన, భవ్యమైన ఆనందమునందించింది వేదము! కానీ మానవుడు సంకుచిత హృదయముతో భేదముగా భావించుకోటంచేత తన భేదము కనిపిస్తున్నాది. మనము ఎట్టి తిండి తింటామో అట్టి త్రేపే వస్తుంది. మామిడిపండు తింటే దోసకాయ త్రేపు వస్తుందా? రాదు. భేదమునే భావిస్తే భేదమే త్రేపు వస్తున్నాది. దేశకాలపరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని రూపనామములుకూడా మారుతుంటాయి. ఆంధ్రులకు తెలుసు; బెజవాడ రసాలుంటాయి. చాలా మధురమైన రసమునందిస్తుంది. ఏమాత్రము పులుపు ఉండదు. జాతి రసాలే! కానీ పండుకాక మునుపు దానిలోకూడా పులుపు ఉంటుంది. అది తిరిగి కాయగా ఉండినప్పుడు వగరుగా ఉంటుంది. వగరు, పులుపు, తీపి ఒకే కాయలోనే ఉంటున్నాయి. అయితే మాధుర్యము ఎప్పుడు వస్తుంది? పరిపక్వస్థితికి వచ్చినప్పుడు మాధుర్యము వస్తుంది. దాని స్వస్వరూపాన్ని అప్పుడు చూపుతుంది. కనుక, మానవత్వములో దివ్యమైన ఆనందము, శాంతి మనకు అర్థము కావాలంటే పరిపక్వ స్థితికి రావాలి. కనుక, మన హృదయమును ఈనాటినుండి పరిపక్వస్థితికి తెప్పించుకోటానికి

sri sathyasai vachanamrutam

తగిన కృషి చేయాలి. కాయ పుట్టింది కదాయని తక్షణమే కోసి తినటానికి ప్రయత్నం చేయకూడదు. అది కొంతకాలము చెట్టుపైనే ఉండి ఫలమయ్యేంతవరకు దానిని కాపాడుకుంటూ రావాలి. ఇది మన కర్తవ్యము. మన హృదయము సరైన పరిపక్వస్థితికి వచ్చేంతవరకు పోషించుకుంటూ రావాలి. ఆ పోషించే విధానములే, ఈ సాధనలు.

**విశ్వాసము లేక ఏదీ సాధించలేరు**

సాధనలలో శాంతి తనంతట తానే ప్రాప్తిస్తూవస్తుంది. ప్రేమతో, ఎంతో విశ్వాసముతో, గాఢమైన భక్తితో వీరందరు ఈ పల్లెకు వచ్చి చేరారు. నిముషమైన విడవకుండా ఒకే వర్షము కురుస్తూ వచ్చింది. వారి యింటియందే ఉంటే వారికి ఎన్నో అనుకూలాలు ఉండేవి. ఇక్కడ ఉండటంచేత వర్షము చింతయే వారికి లేదు. ఆలా తడుస్తూ స్వామికోసమని ఎంతో కాచుకుంటూ వచ్చారు. ఇదే నిజమైన తపస్సు. సుఖదుఃఖములు రెండూ సమత్వంగా భావించుకొని ఏమాత్రము శారీరక భావము లేకుండా వారు గడుపుతూ వచ్చారు, ఈ రెండు దినములు. ఇంతకంటె తపస్సు ఏమిటి? రెండు రోజులు తపస్సు చేశారు. ఎండలో ఎండటము, వానలో నానటము, గాలికి సహించుకోటం. ఈ విధంగా చేశారు. ఈ విధమైన తపస్సు చేశారు. నిజముగా వారి భక్తియే, విశ్వాసమే దీనికి మూలకారణము. విశ్వాసమే లేక ఏదీ సాధించలేరు. ఈ విశ్వాసమును దినదినాభివృద్ధి గావించుకుంటూ దివ్యమైన ఆనందము మీరు అనుభవిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 20-10-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam